క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ఉమామహేశ్వరి

చీపురుపల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా దనుకొండ ఉమామహేశ్వరి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నెలిమర్ల మండలంలోని బొప్పడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయరాలుగా పని చేస్తున్న ఆమె తాజాగా జరిగిన పదోన్నతుల్లో భాగంగా ప్రధానోపాధ్యాయరాలుగా నియమితులయ్యారు. ఇంతవరకు ఇక్కడ హెచ్‌ఎంగా విధులు నిర్వహించిన కె.చంద్రశేఖర్‌కు జామి మండలంలోని భీమసింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా బదిలీ అయ్యింది.

వృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ



వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామం వినాయకనగరానికి చెందిన ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు దాతల సహకారంతో 45 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ వి.హరికుమార్ మాట్లాడుతూ.. ప్రతి నెలా దాతల సహకారంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు మెరుగైన సేవలు

- ఎమ్మెల్యే కళావెంకటరావు



రుంకానవీధి రేషన్ డిపోలో సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

చీపురుపల్లి: రేషన్‌కార్డు లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగానే ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి తిరిగి రేషన్ డిపోలు ప్రారంభించినట్లు ఎమ్మెల్యే కళావెంకటరావు అన్నారు. పట్టణంలోని రుంకానవీధిలో గల రేషన్ డిపో వద్ద ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, ముల్లు రమణ, సారేపాక సురేష్, తహసీల్దార్ ఎన్.రాజారావు, సీఎస్‌డీటీ నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరే గతి..



కలుషిత నీరు వస్తున్న బోరు

చీపురుపల్లి: ప్రతి ఏటా వేసవికాలం వచ్చే సరికి ప్రభుత్వాలు సమ్మర్ క్రాస్‌ప్రోగ్రాం నిర్వహిస్తుండడం చూస్తుంటాం. దీని కోసం లక్షల్లో నిధులు కూడా ఖర్చు చేస్తుంటారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం నిర్వహించారు. కానీ ఎలాంటి ఫలితాన్ని ఇచ్చిందో మేజర్ పంచాయతీ పరిధిలోని వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాల పక్కనే ఉన్న చేతి బోరు చూస్తే అర్థమవుతుంది. వంగపల్లిపేటలోని ఈ చేతి బోరు చాన్నాళ్ల కిందట ఏర్పాటు చేశారు. దీంతో చాలా రోజుల కిందటే బోరు తుప్పు పట్టింది. బోరు హెడ్, నీటి గొట్టాం పూర్తిగా తప్పుపట్టాయి. తప్పుపట్టిన పరికరాల వల్ల కలుషిత నీరు వస్తోందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి బోరు పరికరాలు మార్చాలని కోరుతున్నారు.

బీజేపీ నేత గొల్లపూడి మృతి



గొల్లపూడి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు మాధవ్, రాజేష్ వర్మ

గుర్ల: బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు గొల్లపూడి సత్యనారాయణమూర్తి (65) శనివారం రాత్రి మృతి చెందారు. ఈయన కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూశారు. సత్యనారాయణమూర్తి మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ వర్మ ఆదివారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అవయవదానంలో భాగంగా నెల్లిమర్లలోని మిమ్స్ ఆస్పత్రికి సత్యనారాయణ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు అందజేశారు.

అదే నిరీక్షణ...

- రేషన్ కష్టాలు మళ్లీ మొదలు
- రేషన్ కావాలంటే గడప దిగాల్సిందే..
- మొదటి రోజు అష్టకష్టాలు పడిన లబ్ధిదారులు



కొత్తవలస మండలం డిపో నంబర్ 33 వద్ద రేషన్ సరుకులకై పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

శృంగవరపుకోట నెట్‌వర్క్: ప్రతి ఇంటికీ రేషన్ సరుకులు అందివ్వాలన్న లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం ఎండీయూ వాహనాల వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. దీంతో ప్రతి నెలా ఎండీయూ ఆపరేటర్లు ఇంటికి వచ్చి సరుకులు ఇచ్చేవారు. సరుకులు విడిపించుకోవడంలో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకపోవడంతో ఈ పథకానికి ఎంతో ఆదరణ లభించింది. అటువంటి బృహత్తర పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడేసింది. మళ్లీ పాత పద్ధతిలో డిపోల వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలని చెప్పడంతో మొదటి రోజు సరుకులు విడిపించుకోవడానికి లబ్ధిదారులు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన సరుకుల పంపిణీ అర గంటలోనే ఆగిపోయింది. సర్వర్లు పనిచేయక డిపోల తలుపులు మూసేశారు. దీంతో సరుకుల కోసం రేషన్ డిపోల వద్దకు వెళ్లిన వారు ఉసూరోమంటూ ఇళ్లకు పోయారు. మళ్లీ పాత కష్టాలు వచ్చాయి.. మూటలు మోసుకెళ్లాలి.... గంటల తరబడి క్యూలో ఉండాలి.. ఛీ, ఛీ అంటూ పలువురు పెదవి విరుస్తూ వెళ్లిపోవడం కనిపించింది.

ఐదు కిలోమీటర్లు నడవాలి..



వేపాడ మండలం వీలుపర్తి పంచాయతీలోని చినదుంగాడ గ్రామం మాది. ఇంతవరకూ సరుకుల వ్యాను మా ఇంటి దగ్గరికి వచ్చేది. ఇప్పుడు మళ్లీ రేషన్ సరుకులు తెచ్చుకోవడానికి చామలడివి వెళ్లి రావాలి. మాకు బస్సులు, ఆటోలు లేవు. నడుచుకుంటూ పోవాలి. ఎవరికైనా బైక్‌లు, సైకిళ్లు ఉన్నోళ్లు తెచ్చుకోగలరు. ఆడోళ్లు నడిచిపోవాల్సిందే. చక్కగా ఉన్న పద్ధతిని మళ్లీ ఎందుకు మార్చారో తెలియడం లేదు.

– కొప్పల సత్యవతి, చినదుంగాడ గ్రామం, వేపాడ మండలం

మళ్లీ అగచాట్లే..



రేషన్ సరుకులు పొందేందుకు అగచాట్లు పడాల్సిన పరిస్థితి దాపురించింది. గతంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ వచ్చి సరుకులు అందజేసేవారు. ఆ పద్ధతే బాగుంది. మళ్లీ ఇప్పుడు డిపోలకు వెళ్లమంటున్నారు. మాకు ఇబ్బందులు తప్పవు.

– ద్వారపూడి సత్యారావు, సీతారాంపురం, లక్కవరపుకోట మండలం

పనిచేయని సర్వర్



మెరకముడిదాం: రేషన్‌డిపో వద్ద పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి)/మెరకముడిదాం: రేషన్ డిపోల వద్ద సర్వర్ సమస్యలతో మొదటి రోజు రేషన్ పంపిణీ సక్రమంగా జరగలేదు. గరివిడి మండలంలో 46 రేషన్ డిపోలు ఉండగా 20,800 రైస్ కార్డులున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ రేషన్ డెలివరీ జరిగేది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ నెల నుంచి వాహనాలను తొలగించడంతో డిపోల వద్ద సరుకులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే డిపోల వద్ద గంటల తరబడి క్యూలో నిల్చోవడం.. సర్వర్ పనిచేయకపోవడం.. సరుకులు మోసుకుంటూ రావడం వంటి సమస్యలతో తమకు ఇక్కట్లు తప్పవని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఇబ్బందులకు గురి చేయడం తగదు...



నా పేరు సంకిలి నారాయణమ్మ. మాది మెరకముడిదాం మండల కేంద్రం. జగన్ హయాంలో గత ఐదేళ్లు ఇంటి వద్దనే సరుకులు తీసుకున్నాం. ఆ విధానం ఎంతో బాగుండేది. ఇప్పుడు ప్రభుత్వం మారాక మళ్లీ డిపోల వద్దకు వెళ్లమనడం సరికాదు. కిలోమీటర్ల కొద్దీ నడుచుకుంటూ వచ్చి సరుకులు తీసుకెళ్లాలి. పాత విధానమే అమలు చేయాలి.

రేషన్ కష్టాలు..



గజపతినగరం మండలం గంగచోళ్లపెంట 2వ నంబర్ రేషన్ డిపో వద్ద సర్వర్ పని చేయకపోవడంతో లబ్ధిదారుల ఎదురుచూపులు



దత్తిరాజేరు మండలం వంగర రేషన్ షాపు వద్ద రేషన్ సరుకుల కోసం వేచి ఉన్న లబ్ధిదారులు



గంట్యాడ మండలం పెదవేమలి రేషన్ షాపు వద్ద సరుకుల కోసం పడిగాపులు



దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలో డిపో వద్ద లబ్ధిదారులు

దత్తిరాజేరు: ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో తమకు రేషన్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జగనన్న హయాంలో ఇంటి వద్దకే వచ్చి సరుకులు ఇచ్చేవారు. కూటమి కొలువుదీరాక ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడంతో జూన్ నెల నుంచే రేషన్ కష్టాలు మొదలయ్యాయి. నియోజకవర్గంలోని దత్తిరాజేరు, గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ మండలాలలో పరిధిలో ఉన్న 138 గ్రామ పంచాయతీలలో రేషన్ దుకాణాలు వద్ద లబ్ధిదారులు ఆదివారం ఉదయం గంటల కొద్దీ వేచి ఉండాల్సి వచ్చింది. సర్వర్లు ఎప్పటికప్పుడు మొరాయించడంతో డీలర్లు కూడా సరుకుల పంపిణీకి చేతులెత్తేశారు. గజపతినగరం మండలం గంగచోళ్లపెంట రేషన్ షాపు–2లో సర్వర్ పని చేయక పోవడంతో వృద్ధులు, మహిళలు గంటల కొద్దీ క్యూలో నిల్చొన్నారు. కొన్ని గ్రామాలలో కూటమి నాయకులు ప్రారంభించిన అర గంటలోనే రేషన్ దుకాణాలు మూసి వేయడంతో లబ్ధిదారులు సాయంత్రం వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మేలు చేసిన జగనన్నను కాదని కూటమిని గెలిపించుకునేందుకు బాగానే జరుగుతోందని పలువురు అనుకోవడం విశేషం.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు..

కొత్తవలస: వైఎస్సార్‌సీపీ శృంగవరపుకోట నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను పార్టీ అధిష్టానం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు వారి వివరాలను ఆదివారం వెల్లడించారు. యువజన విభాగం అధ్యక్షుడిగా వాకడ సతీష్ (ఎస్.కోట మండలం).. మహిళా విభాగానికి ముమ్ములూరు వెంకటలక్ష్మి (వేపాడ మండలం).. రైతు విభాగానికి గేదెల నర్సింనాయుడు(ఎల్.కోట మండలం).. బీసీ విభాగానికి మురిపిండి గంగరాజు (వేపాడ మండలం).. ఎస్సీ విభాగానికి బోని కుమారి (కొత్తవలస మండలం).. ఎస్టీ విభాగానికి కేత వీరన్న (ఎస్.కోట మండలం).. మైనార్టీ విభాగానికి షేక్ రహమాన్ (ఎస్.కోట మండలం).. క్రిష్టియన్ మైనార్టీ అధ్యక్షుడిగా గోకేడ సత్యంనాయుడు (వేపాడ మండలం).. విద్యార్థి విభాగానికి కూనరెడ్డి వెంకటరావు (ఎస్.కోట మండలం), వలంటీర్స్ విభాగానికి జేడీకే అప్పలరాజు (ఎల్.కోట మండలం).. గ్రీవెన్స్ విభాగానికి కండిపల్లి పెదనాయుడు (వేపాడ మండలం).. వాణిజ్య విభాగానికి కొట్యాడ శ్రీనివాసరావు (ఎల్.కోట మండలం), చేనేత విభాగానికి స్వర్ణపూడి వెంకటరమణ (వేపాడ మండలం), కార్మిక విభాగానికి కోన దేముడు (కొత్తవలస మండలం), టీచర్స్ విభాగానికి జి.కృష్ణారావు (జామి మండలం), అంగన్‌వాడీ విభాగ అధ్యక్షురాలిగా బొడ్డి చాముండేశ్వరి (కొత్తవలస మండలం), లీగల్ విభాగానికి కళ్లంపూడి మహేష్ (కొత్తవలస మండలం), సాంస్కృతిక విభాగానికి బీల సతీష్ (వేపాడ మండలం), సోషల్ మీడియా విభాగానికి యడ్ల కిశోర్‌కుమార్(లక్కవరపుకోట మండలం), ఐటీ విభాగానికి జి.శ్రీనివాసరావు(కొత్తవలస మండలం), దివ్యాంగుల విభాగానికి డి.అప్పలరాం (జామి మండలం), డాక్టర్ల విభాగానికి పి.శ్రీనివాసరావు (ఎస్.కోట), ఇంటలెక్చువల్ విభాగానికి తూర్పాటి శివాజీ (ఎల్.కోట), ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడిగా ఎం.కృష్ణంనాయుడు(ఎస్.కోట), బూత్ కమిటీ విభాగానికి గేదెల వెంకటరావు (జామి మండలం), ప్రచార విభాగ అధ్యక్షుడిగా బోదల సురేష్(కొత్తవలస మండలం) నియమితులయ్యారు.

'వెన్నుపోటు దినం'ను విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే కడుబండి పిలుపు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

కొత్తవలస: అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా ఒక్క హామీ కూడా నెరవేర్చకపోవడంపై ఈ నెల నాలుగో తేదీన వెన్నుపోటు దినం పేరిట నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. అర్థన్నపాలెం గ్రామ సమీపంలో గల క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తలతో ఆదివారం సాయంత్రం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు మాటలతో గారడీ చేస్తున్నారే తప్ప ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని మండిపడ్డారు. నాడు పిల్లనిచ్చిన మామకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు నేడు ఐదు కోట్ల ఆంధ్రులకు వెన్నుపోటు పొడిచారన్నారు. కూటమి ప్రభుత్వం తీరుకు నిరసనగా ఈ నెల నాలుగో తేదీన ఎస్.కోటలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామం నుంచి కనీసం 30 మందికి పైగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ఆకుల డిపో నుంచి భారీ ఎత్తులో ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు ఇస్తామని చెప్పారు. కార్యకర్తల కష్టనష్టాలను పార్టీ అధినాయకత్వం చూసుకుంటుందని.. నిరుత్సాహ పడవద్దని సూచించారు. ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి మాట్లాడుతూ.. పార్టీ గ్రామస్థాయిలో పటిష్టంగా ఉందన్నారు. సమావేశానికి ఇంతమంది హాజరుకావడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు చిన్నరామునాయుడు, జామి మండల అధ్యక్షుడు జి.రవికుమార్ మాట్లాడుతూ.. చంద్రబాబు వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కొత్తవలస, ఎల్.కోట ఎంపీపీలు నీలంశెట్టి గోపెమ్మ, గేదెల శ్రీనివాసరావు, కొత్తవలస మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, ఎస్.కోట జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, వేపాడ జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు మూకల కస్తూరి, పార్టీ నాయకులు బొంతల వెంకటరావు, పల్లా భీష్మ, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సినీ రంగంలో రాణిస్తున్న దాసరిపేట కుర్రోడు



అన్నపూర్ణ స్టూడియోలో నటి అన్నపూర్ణకు సీన్ వివరిస్తున్న సిద్దూ తాడేల



సినిమా షూటింగ్‌లో కాలికేయ ప్రభాకర్‌తో..

దత్తిరాజేరు: మండలంలోని దాసరిపేటకు చెందిన యువకుడు సిద్దూ తాడేల సినీ రంగంలో రాణిస్తున్నాడు. సిద్దూకు చిన్నప్పటి నుంచే సినిమాలంటే విపరీతమైన మోజు. దీంతో తాను ఇంటర్ వైజాగ్‌లో చదువుతానని చెప్పి గ్రామంలో కూలి పనులు చేసుకుంటున్న తల్లిదండ్రులను ఒప్పించి వైజాగ్‌కు మకాం మార్చాడు. అక్కడ బీవీకే కళాశాలలో ఇంటర్‌లో చేరినా సినిమాలపై ఉన్న ఆసక్తితో వైజాగ్‌లో ఎక్కడ సినిమా షూటింగ్‌లు జరిగినా అక్కడ వాలిపోయి అన్నీ గమనించేవాడు. వైజాగ్‌కు చెందిన ప్రొడక్షన్ మేనేజర్ గెద్దం శ్రీను పిలుపుతో సిద్దూ సినిమా రంగం వైపు అడుగులేశాడు. ప్రస్తుతం 24 సంవత్సరాల వయసున్న సిద్దూ సింగం–3, జయమ్ము నిశ్చయమ్మురా, ఉన్నది ఒక్కటే జిందగీ, నిన్ను కోరి, జక్కన్న, తదితర సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాడు. బాహుబలి ప్రభాకర్ ప్రధాన పాత్రలో ఓ సినిమా పూర్తి చేశానని.. అది ప్రస్తుతం పోస్టు ప్రొడక్షన్‌లో ఉందని... అలాగే హాస్యబ్రహ్మ బ్రహ్మానందం ప్రధాన పాత్రలో మరో సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం లభించినట్లు సిద్దూ తెలిపారు. సినిమా రంగంలో అంచెలంచెలుగా ఎదుగుతున్న సిద్దూను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

ఘనంగా బండెమ్మ తల్లి పండగ

శృంగవరపుకోట: మండలంలోని ఎస్.కోట పంచాయతీ శివారు గ్రామమైన సీతంపేటలో బండెమ్మ పండగ ఆదివారం కోలాహలంగా ముగిసింది. 14 ఏళ్ల తర్వాత పండగ నిర్వహించడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



కోలాటం ఆడుతున్న కళాకారులు



సీతంపేటలో తీన్‌మార్ సందడి

కూటమి పాలనలో అభివృద్ధి శూన్యం

- ఎంపీపీ హైమావతి, జెడ్పీటీసీ సభ్యుడు నరసింహమూర్తి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ హైమావతి, జెడ్పీటీసీ సభ్యుడు నరసింహమూర్తి, తదితరులు

గంట్యాడ: ఏడాది కూటమి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం శూన్యమని ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి ఆరోపించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల నాలుగో తేదీన వెన్నుపోటు దినం పేరిట నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు రామవరం గ్రామంలోని ఎంపీపీ నివాసంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ.. అధికారంలోకి రావడం కోసం కూటమి నాయకులు అలవికాని హామీలు ఇచ్చారని.. ఒక్క హామీ కూడా నెరవేర్చలేకపోయారని ఎద్దేవా చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500, అన్నదాతలకు అన్నదాత సుఖీభవ సాయం రూ. 20 వేలు, విద్యార్థులకు తల్లికి వందనం .. ఇలా ఏ సంక్షేమ పథకాన్నీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ హయాంలో నాడు – నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చగా.. నేటి ప్రభుత్వ హయాంలో విద్యారంగం భ్రష్టు పట్టిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, పార్టీ నాయకులు ఎ. మహేష్, వి.మల్లునాయుడు, పి. వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

4న వెన్నుపోటు దినం



వాల్‌పోస్టర్లు ఆవిష్కస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దత్తిరాజేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలకు నిరసనగా ఈ నెల 4న చేపట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్‌తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆ రోజు ఉదయం 9 గంటలకు గజపతినగరంలోని పార్టీ కార్యాలయం వద్దకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున చేరుకోవాలని పిలుపునిచ్చారు. అక్కడ నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఆధ్వర్యంలో నిరసన తెలియజేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వింద్యవాసి, షికారుగంజి సర్పంచ్‌లు రంభ చంద్రశేఖర్, సుంకరి వెంకటరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మండల శ్రీను, మహదేవ్ ఫణీంద్రుడు, మజ్జి అప్పలనాయుడు, పిల్లా రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంపై 'కూటమి' నిర్లక్ష్యం..

- మరుగుదొడ్లు లేక ఇబ్బందులు
- రక్షణగోడ నిర్మాణం ఇంకెన్నడో..



పాఠకులతో కిటకిటలాడుతున్న గ్రంథాలయం



గజపతినగరం గ్రంథాలయం భవనం

గజపతినగరం రూరల్: ప్రజలకు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాల్లో కనీస వసతులు లేక పాఠకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయానికి నిత్యం వంద నుంచి రెండొందల మంది వరకు పాఠకులు వస్తుంటారు. ఈ గ్రంథాలయంలో దినపత్రికలతో పాటు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. దీంతో పాఠకులు అధిక సంఖ్యలో ప్రతిరోజూ గ్రంథాలయానికి వస్తుంటారు. అయితే కుర్చీలు సరిపడా లేకపోవడంతో పాఠకులు ఆరుబయట నిల్చొని చదువుకోవాల్సి వస్తోంది. అలాగే గ్రంథాలయంలో గదుల కొరతతో పాటు మరుగుదొడ్లు లేక పాఠకులు చాలా ఇబ్బంది పడుతున్నారు. పాఠకుల్లో అధికశాతం మంది మహిళలు, వృద్ధులు కావడంతో వారి బాధ వర్ణనాతీతం. అలాగే గ్రంథాలయ భవనానికి రక్షణగోడ లేకపోవడంతో ఆవరణలోనికి పశువులు, కుక్కలు, పందులు వచ్చి నిత్యం అపరిశుభ్ర వాతావరణం సృష్టిస్తున్నాయని పాఠకులు చెబుతన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రంథాలయాల నిర్వహణ అధ్వానంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి..

గ్రంథాలయానికి నిత్యం సుమారు రెండొందల మంది వరకు పాఠకులు వస్తుంటారు. అందులో అధిక శాతం మహిళలు, వృద్ధులు ఉంటున్నారు. గ్రంథాలయం ఆవరణలో మరుగుదొడ్లు లేక నానా ఇబ్బంది పడుతున్నాం. వెంటనే మరుగుదొడ్లు నిర్మించాలి.

–తాడ్డి.లావణ్య, పాఠకురాలు, గజపతినగరం

ప్రహరీ లేక ఇబ్బందులు

గ్రంథాలయానికి ప్రహరీ లేకపోవడంతో పశువులు, పందులు ఆవరణను పాడు చేస్తున్నాయి. ఆవరణలో ఉన్న పూల మొక్కలు పాడవుతున్నాయి. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలి.

– అల్తి జగదీష్, దిగువవీధి, గజపతినగరం

ఉన్నతాధికారులకు నివేదించాం..

గ్రంథాలయంలో లోపల ఒక్క మరుగుదొడ్డి ఉన్నా నీరు లేక వినియోగంలో లేదు. అలాగే రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలని, మరుగుదొడ్లు నిర్మించాలని ఉన్నతాధికారులకు తెలియజేశాం.

–స్వాతి, లైబ్రేరియన్ గజపతినగరం